తెలుగు సంచలనం
ప్రతి అక్షరం – ప్రజల పక్షం
మంగళవారం
4 ఆగస్టు 2026

# కేజీబీవీలో ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## పాడైన కూరగాయల సరఫరాపై ఆగ్రహం.. బాధ్యులపై చర్యలకు ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, వసతి, భోజనం, విద్యా బోధన తదితర అంశాలను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే, నిల్వ ఉంచిన కూరగాయల్లో పాడైనవి ఉండటాన్ని గుర్తించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సహించబోమని స్పష్టం చేస్తూ, నాసిరకం కూరగాయలు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత బిల్లుల చెల్లింపులను నిలిపివేసి పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని సూచించారు. పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంప్యూటర్లు వినియోగంలో లేకపోవడాన్ని గమనించిన ఎమ్మెల్యే, వాటిని వెంటనే మరమ్మతు చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి విద్యార్థికి డిజిటల్ విద్య అందేలా ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరు నమోదును పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని హెచ్చరించారు. ప్రతి విద్యార్థి పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో చదువుకునేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల్లో మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య, మెరుగైన వసతి, పోషకాహారం కల్పనకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని విద్యార్థులకు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయవర్ధన్ రెడ్డి, సర్పంచ్ మద్దిలేటి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుంకెనపల్లి అంగన్వాడి కేంద్రాల్లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు





**చిట్యాల, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** మండల పరిధిలోని సుంకేనపల్లి గ్రామంలో సోమవారం రోజున అంగన్వాడి 1, 2 కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడీ టీచర్లు యన్. భాగ్యమ్మ, ఎం.రజిత మాట్లాడుతూ తల్లిపాల లో శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు.
ముర్రు పాలు శిశువుకు ఇవ్వడం ద్వారా శిశువు ఎంతో ఆరోగ్యంగా ఉంటారు అన్నారు బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు మురిపాలు తాగించాలని అన్నారు. తల్లిపాలు బిడ్డకు ఎంతో ఆరోగ్యాన్నిస్తూ జీర్ణాశయాన్ని మెరుగుపరుస్తూ ఉంటుందన్నారు. శిశువులకు తల్లిపాలు శ్రేష్ఠమని డబ్బాపాలు హానికరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా ధృవపత్రాలు ఉన్న బ్యాగ్ మిస్

**– బ్యాగ్ దొరికిన వారు తిరిగి అందించాలని విజ్ఞప్తి**



**చిట్యాల, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతానికి చెందిన భీమవరపు వెంకటేష్ తండ్రి శ్రీనివాస్ రావు తన విలువైన విద్యా ధృవపత్రాలు ఉన్న బ్యాగ్‌ను అనుకోకుండా పోగొట్టుకున్నారు. జూలై 23 నాడు తన మిత్రుడి ఇంటికి చిట్యాల పట్టణానికి సమీపంలోని శివనేనిగూడెం గ్రామానికి వెళ్లిన వెంకటేష్, తిరుగు ప్రయాణంలో శివనేనిగూడెం నుంచి చిట్యాల బస్టాప్‌కు వస్తున్న సమయంలో తన బ్యాగ్ కనిపించకుండా పోయిందని తెలిపారు. పోగొట్టుకున్న బ్యాగ్‌లో ఇంటర్మీడియట్ మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (టిసి), ఆధార్ కార్డుతో పాటు ఇతర ముఖ్యమైన విద్యా సంబంధిత పత్రాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ ధృవపత్రాలు తన భవిష్యత్‌కు ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. బ్యాగ్ లేదా అందులోని పత్రాలు ఎవరికైనా దొరికితే మానవత్వంతో తిరిగి అందించాలని, లేదా సమాచారం ఇవ్వాలని వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. సంప్రదించవలసిన మొబైల్ నంబర్: 9391308811 "బ్యాగ్ లేదా పత్రాలు దొరికి తిరిగి అందించగలరని కోరారు.

## చేనేత సహకార సంఘం భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**చిట్యాల, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** చిట్యాల చేనేత సహకార పరపతి సంఘం కు చెందిన స్థలం చిట్యాల పాల కేంద్రం ఎదురుగా ఉన్న స్థలం ను సోమవారం సంఘం పాలకవర్గం, పట్టణ కుల పెద్దలు వెళ్లి పరిశీలించారు. ఈ స్థలంలో సహకార సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే వేముల వీరేశం పాలకవర్గానికి హామీ ఇచ్చి, అంచనా వేయమని, ఎస్టిమేషన్ కోసం పంచాయతీ రాజ్ ఏఈ ని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పాలకవర్గం వెళ్లి నాటిన కడీలను, అప్పటి కలెక్టర్ దయాచారి వేసిన ఫౌండేషన్ స్టోన్ ను పరిశీలించారు. ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారంతో భవన నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తామని చేనేత సహకార సంఘం చైర్మన్ గంజి సుధాకర్, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షులు మిర్యాల వెంకటేశం, కోశాధికారి కోట రాంబాబు, డైరెక్టర్లు మిర్యాల ప్రకాశ్, వడ్డేపల్లి రాములు, పట్టణ కుల పెద్దలు జెల్లా మనోహర్, గంజి వెంకటేశం, జెల్లా సత్తయ్య, గంజి కనకయ్య సంగిశెట్టి మనోహర్, గంజి గోవర్ధన్, తడక మురళి, గుజ్జరి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## పౌరసరఫరాల అధికారిని కలిసిన వినియోగదారుల సంఘాల సభ్యులు



**భువనగిరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ సభ్యులు సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి రోజా రాణి ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అధికారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షులు పోచం సోమయ్య, ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి యాదగిరి లు మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారుల సంఘాలను బలోపేతం చేయడానికి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సహకారం అందించాలని కోరారు. జిల్లాలో వినియోగదారులను చైతన్యం చేయడానికి సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వినియోగదారుల సభలు, చైతన్య సదస్సులు నిర్వహించి ప్రజలను జాగృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ కొడారి వెంకటేష్, జిల్లా వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ ఉపాధ్యక్షులు ఎలిమినేటి నగేష్, దేవునిగూడెపు బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

**– గ్రీవెన్స్ లో కలెక్టర్ గారికి ఫిర్యాదు**



**చిట్యాల, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** మండల పరిధిలోని పెద్దకాపర్తి గ్రామంలో గల నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న డిటిసిపి లే అవుట్ పర్మిషన్లను వెంటనే రద్దు చేయాలని, కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజావాణిలో పెద్దకాపర్తి గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు మర్రి హరీష్ రెడ్డి, జెల్ల ప్రశాంత్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమి నుంచి వందల ఎకరాలకు రోడ్డు ఏర్పాటు చేయడం జరిగిందని పలుమార్లు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసిన ఫలితం శూన్యం అని వారు తెలిపారు. ఓ ప్రవేట్ వెంచర్ కు రోడ్డు నిర్మాణానికి గ్రామ పంచాయతీ పాలక వ్యతిరేకంగా తీర్మానం చేసిన పట్టించుకోకుండా ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించక పోతే రానున్న రోజుల్లో గ్రామం కోసం ఉద్యమం చేపడమన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన వారిలో సిలివేరు నరసింహ, మాచర్ల యాదగిరి పొట్లపల్లి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటులోకి తొలి ప్రైవేట్ ఆయిల్ పామ్

**ఖమ్మం :** తెలంగాణలో తొలి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ఖమ్మం జిల్లా అంజనాపురంలో ఈ నెల 20న ప్రారంభం కానుంది. గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ రూ.300 కోట్ల పెట్టుబడితో 113.5 ఎకరాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 700 మందికి ఉపాధి లభించనుంది. మలేసియా భాగస్వామ్యంతో దేశంలోనే తలమానికంగా నిలిచే సీడ్ గార్డెన్‌ను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మరో ఆరు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలను ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.తెలంగాణ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటి ప్రైవేటు సమీకృత ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. ప్రముఖ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ సంస్థ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రెవెన్యూ పరిధిలోని అంజనాపురం గ్రామపంచాయతీలో ఈ మెగా ప్రాజెక్టును నిర్మించింది.

## మహిళా సంఘం భవనానికి ఘనంగా భూమి పూజ



**నాంపల్లి, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** నాంపల్లి మండల పరిధిలోని స్వాములవారి లింగోటం గ్రామంలో మహిళా సంఘాల అభివృద్ధి కోసం నూతనంగా మంజూరైన రెండు వివో భవనాల నిర్మాణానికి ఆదివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు పూర్తి చేసి భవన నిర్మాణ స్థలంలో ముగ్గు పోసి పనులను ప్రారంభించారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈఈ ఇంజనీర్ అంగరేకుల జీవన్, గ్రామ కార్యదర్శి వినయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామంలో మహిళా సంఘాల బలోపేతానికి, వారి సమావేశాలు మరియు ఇతర కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఈ నూతన భవనాలు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. పాల్గొన్న నాయకులు, అధికారులు, ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు నల్లపు వెంకటేశ్వర్లు, కీత హరిబాబు, నల్లపు నాగరాజులతో పాటు బుక్ కిపర్ పడకండ్ల శ్యామల, సూరిగి నరసింహ, మట్టిపల్లి అంజయ్య, బేక్కం రవితేజ, చాట మారయ్య, కీత ఈశ్వర్ మరియు గ్రామ మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ టీఎస్ లక్ష్యం

**గడసంతల మధుసూదన్**





**రాజాపేట, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** పీఆర్టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాజాపేట మండలంలోని జడ్పీహెచ్ఎస్ బొందుగుల పాఠశాలలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి గడసంతల మధుసూదన్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే సంఘం పీఆర్టీయూ టీఎస్ అని అన్నారు. సీపీఎస్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, డీఏ బకాయిలు విడుదల చేయాలని, పీఆర్సీని మంచి ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ నెలలో ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా భారీ ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈహెచ్ఎస్ కార్డుల అమలు కూడా త్వరలో వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఆర్టీయూ టీఎస్ మాటలు చెప్పే సంఘం మాత్రమే కాదని, చెప్పిన మాటను చేసి చూపించే సంఘమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పరమేష్, రాజాపేట మండల అధ్యక్షుడు సంపతి సుబ్బరాజు, మండల ప్రధాన కార్యదర్శి గౌటే బాలరాజు, మహిళా ఉపాధ్యక్షురాలు వాంకుడోతు భారతి, జిల్లా బాధ్యులు రవీందర్, నరేష్ తదితర ఉపాధ్యాయులు పాల్గొనారు.

## మనిగిళ్లలో సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం

**సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జలసిరి కార్యక్రమం ప్రారంభం**



**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 03(సంచలనం న్యూస్):** వనపర్తి జిల్లా, పెద్దమందడి మండలం మనిగిళ్ల గ్రామంలో జలసిరి కార్యక్రమంలో భాగంగా సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో నీటి నిల్వలు పెంచడం, భూగర్భ జలాలను పరిరక్షించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి ఊరికి ఊటకుంట, ప్రతి పొలానికి పంటకుంట అనే నినాదంతో గ్రామంలో నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి అవసరాలకు వినియోగించిన నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు నీటి నిల్వలు అందుబాటులో ఉండాలంటే భూగర్భ జలాలను పెంచడం అత్యంత అవసరమని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించేందుకు గ్రామ ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వెంకటేష్, ఉప సర్పంచ్ ముప్పూరి గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్, గ్రామ పెద్దలు సంచార మౌని రాములు, రాంరెడ్డి, ప్రతాప్ రెడ్డి, బాలరాజు, వెంకటయ్య, శ్రీకాంత్ రెడ్డి, కోములయ్య, రాములు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

Publisher & Owner by Reesaanvi Media House, H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Chief Editor: Bathula Ganesh.
H.No: 6-25, Kothagudem, Ramannapet, Yadadri Bhuvanagiri- 508113, Regd. No: TS-30-0043998, Email: sanchalanamnewsdesk@gmail.com, Cell: 9177108128